www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 9 జూన్ 2025

5

చిత్తూరు

## కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** ఈ నెల 9వ తేదీ సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు ఉదయం 9 గంటల కల్లా తప్పక హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. దీనితో పాటు నియోజక వర్గ, మండల స్థాయిలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో నియోజకవర్గ, మండల స్థాయి అధికారులందరూ విధిగా హాజరు కావాలని ఆదేశించారు.

వెబ్ కౌన్సిలింగ్ వద్దు..

# అయ్యోర్ల అగచాట్లు

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్**

ఉపాధ్యాయ బదిలీల్లో వెబ్ కౌన్సిలింగ్ తీసుకురావడాన్ని ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల చర్చల సందర్భంగా బదిలీలు మ్యానివల్‌గా నిర్వహిస్తామంటూ హామీ ఇచ్చి మాట తప్పిందంటూ ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు ఉపాధ్యాయులు.

అయ్యోర్ల బదిలీల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులకు ఆగ్రహం తెపిస్తోంది. ఉపాధ్యాయ బదిలీలు అయ్యోర్లను ముప్పతిప్పలు పెట్టిస్తోందంటున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం ఈనెల 12వ తేదీ దగ్గరపడుతున్న తరుణంలో ఉపాధ్యాయ బదిలీల్లో ఏ ఉపాధ్యాయుడు ఎక్కడి బదిలీ చేస్తున్న విషయం జిల్లా విద్యాశాఖ స్పష్టం చేయలేకపోవడంతో ఇటు ఉపాధ్యాయులకు, విద్యార్థులు ఇబ్బందులకు గురికావాల్సివస్తుంటున్నారు. ఆన్‌లైన్ బదిలీలు నిర్వహించడం వల్ల ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని శనివారం ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన బదిలీల్లో 12మంది ఉపాధ్యాయులే బదిలీ కావడం ఇందుకు నిదర్శనమంటున్నారు. వెబ్‌ఆప్షన్స్‌పై ఉపాధ్యాయుల్లో అపనమ్మకం ఉందంటున్నారు.

ఉపాధ్యాయ బదిలీల విషయంలో ప్రభుత్వం అన్యాయం చేయాలని చూస్తే పెద్దఎత్తున్న ఉద్యమిస్తామని హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం మండుటెండను సైతం లెక్కచేయకుండా జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు మహిళా ఉపాధ్యాయుల రోడ్డుపై బైటాయించి ఆందోళనకు దిగారు. ప్రభుత్వం మ్యానువల్‌గా బదిలీలు చేపడతామని హామీ ఇచ్చేంత వరకు ఆందోళన తప్పదని హెచ్చరించారు. భారికేట్లు పోలీసు బలగాలతో ఉపాధ్యాయ ఉద్యమాన్ని అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నించినా ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి బదిలీల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఎండగట్టారు.

వెబ్‌కౌన్సిలింగ్ ద్వారా ఉపాధ్యాయ బదిలీలు నిర్వహిస్తే ఎట్టిపరిస్థితుల్లో సహకరించేది లేదని స్పష్టం చేస్తున్నారు. ఉపాధ్యాయ బదిలీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రకసరత్తు చేసి చివరి నిమిషంలో వెబ్‌కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు నిర్వహించడం ఉపాధ్యాయ సంఘాలతో చర్చించిన మ్యానువల్‌గా నిర్వహిస్తామని హామీ ఇచ్చి తీరా ఆన్‌లైన్‌లో చేపట్టడం ఏమిటని ప్రశ్నస్తున్నాయి.

# బదిలీలు ప్రత్యక్ష పద్ధతిలోనే జరపాలి

## డీఈవో కార్యాలయాన్ని ముట్టడించిన ఉపాధ్యాయులు

చిత్తూరులోని డీఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** రాష్ట్రంలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలను ఆన్లైన్ వెబ్ కౌన్సిలింగ్‌లో కాకుండా ప్రత్యక్ష పద్ధతిలో జరపాలని ఆదివారం చిత్తూరు డీఈవో కార్యాలయాన్ని ఉపాధ్యాయులు పెద్దఎత్తున ముట్టడించారు. రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన ప్రక్రియ మొత్తం ఆన్లైన్లో జరగ్గా, ఉపాధ్యాయుల కోరిక మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, గత రెండు రోజులుగా బదిలీలను ఆన్లైన్లో జరపడానికి అధికారులు సమాయత్తమవడాన్ని జీర్ణించుకోలేని ఉపాధ్యాయులు జిల్లా నలుమూలల నుండి వేలసంఖ్యలో తరలివచ్చి చిత్తూరు డిఈఓ కార్యాలయాన్ని ముట్టడించి తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బదిలీలు ఉద్యోగోన్నతులను నిర్వహించడానికి ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చినప్పటికీ చట్టంలో ఉన్నట్లుగా కాకుండా మొత్తం బదిలీలు ఉద్యోగోన్నతులు అస్తవ్యస్తంగా తయారయ్యాయని, మొన్న జరిగిన స్కూల్ అసిస్టెంట్ బదిలీలలో ప్రిఫరెన్స్ క్యాటగిరి ఉపాధ్యాయులు పెద్దమొత్తంలో నష్టపోయారని, వెబ్ కౌన్సిలింగ్లో బదిలీలు నిర్వహించడం వల్లే ఇలాంటి పరిస్థితి దాపురించిందని వారు పేర్కొన్నారు. కాబట్టి సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులకైనా వెబ్ కౌన్సిలింగ్ రూపంలో కాకుండా, ప్రత్యక్ష కౌన్సిలింగ్ నిర్వహించి వారు కోరుకున్న ప్రాంతానికి బదిలీ అయ్యే అవకాశం కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. ఉపాధ్యాయులు ఆన్లైన్లో బదిలీలు కోరుకునే క్రమంలో వేలకొద్దీ పోస్టులకు ఆప్షన్ ఇచ్చుకోవలసి ఉంటుందని, అలా ఇచ్చుకున్నప్పటికీ ఆన్లైన్ సిస్టంలో సాంకేతిక సమస్యల వలన అనేక తప్పులు జరిగి ఉపాధ్యాయులు నష్టపోతున్నారని నాయకులు ఆరోపించారు. ఆ రకంగా నష్టపోయిన ఉపాధ్యాయులకు సంబంధించిన ఫిర్యాదులు చేసినప్పటికీ వాటిని పరిష్కరించకపోగా, కనీసం ఫిర్యాదులు కూడా తీసుకోవడం లేదని, దీన్ని తీవ్రంగా నిరసిస్తున్నామని వారు తెలియజేశారు. ఇలాంటి ఇబ్బందులు లేకుండా బదిలీలు జరగాలంటే వెబ్ కౌన్సిలింగ్ రూపంలో కాకుండా ప్రత్యక్ష పద్ధతిలో బదిలీలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుండి వివిధ సంఘాల రాష్ట్ర నాయకులు బాలాజీ, గిరి ప్రసాద్‌రెడ్డి, జివి రమణ, చెంగల్రాయ మందడి, ముత్యాలరెడ్డి, ఎం.సోమశేఖర్ నాయుడు, ఎన్.మణిగండన్, ఎన్ఆర్.మదన్మోహన్ రెడ్డి, బి.మోహన్, కిరణ్ కుమార్, ముక్తిర్ హమ్మద్, కెఎస్.కన్నన్, విజయ్ భాస్కర్‌రెడ్డి, నాగరాజా, జి.సాంబిరెడ్డి, ఎస్.వెంకటమురి, జి. మునీర్ అహమ్మద్, పి.సుధాకర్ రెడ్డి, కె. దీనావతి పాల్గొన్నారు.

# ఏనుగుల దాడిలో పంట నష్టం

ఏనుగుల దాడిలో ధ్వంసమైన మామిడి చెట్లు, టమాటా పంట

### పేటూరులో తిష్టవేసిన ఏనుగుల మంద

**ప్రజాశక్తి- సోమల:** సోమల మండలంలోని పేటూరు, అన్నెమ్మగారిపల్లి, పెద్దఉప్పరపల్లి అటవీ ప్రాంతాలలో ఏనుగుల మంద సంచరిస్తూ రాత్రి వేళల్లో అటవీ సమీప గ్రామాలలోకి రావడం పంటపొలాలపై దాడులు చేయడం చేస్తూ ఈ ప్రాంత ప్రజలను రైతులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. గత పదిరోజులుగా ఈ ప్రాంతంలో 14 ఏనుగుల గుంపు సంచరిస్తూ రాత్రి వేళల్లో మామిడి, టమాటా, బొప్పాయి పంటలపై దాడులు చేస్తూ రైతులకు తీవ్రనష్టాన్ని కలిగిస్తున్నాయి. ఆరుగాలం కష్టించి పండించిన పంటలు ఏనుగుల దాడిలో నష్టపోతూ ఉంటే అటు ఆర్థికంగా ఇటు మనోవేదనతో ఆందోళన చెందుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నిత్యం ఏనుగుల సంచరిస్తూ పంటలపై దాడులు చేయడం, పంటలను ధ్వంసం చేయడం గ్రామాలకు దగ్గరకు రావడం చేస్తూ ఈ ప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. శుక్రవారం, శనివారం రాత్రి పేటూరు దేసయ్య, చిట్టి, ప్రసాద్, పెద్దఉప్పరపల్లికు చెందిన ప్రకాష్, సుబ్రహ్మణ్యం, రమేష్, చంద్రయ్య రైతులకు చెందిన మామిడి, టమాటా పంటలపై దాడిచేసి తోటలు మొత్తం తిరుగాడి పంటలను తొక్కి, కొమ్మలను విరిచి తీవ్రంగా నష్టపరిచాయని రైతులకు తెలిపారు. కనిగలచెరువు వద్ద తిష్టవేసిన ఏనుగుల మందను అటవీశాఖ అధికారులు తరిమివేసి రైతుల పంటలను కాపాడాలని ఈ ప్రాంత ప్రజలు రైతులు కోరుతున్నారు.

### పులిచెర్లలో ఏనుగుల సంచారం

**రొంపిచర్ల:** పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీ ఎద్దులవారిపల్లి రైతులకు చెందిన పంట పొలాల్లో ఆదివారం తెల్లవారుజామున ఏనుగుల గుంపు మామిడి తోటలో ప్రవేశించి మామిడి కొమ్మలు విరిచి కాయలను నేలరాల్చి, పొలాలను తొక్కుకుంటూ అడవిలోకి ప్రవేశించాయి. ఈ విషయం స్థానికులు ఫారెస్ట్ అధికారులకు తెలియజేశారు. ఎఫ్‌బిఓ శ్రీదేవి మాట్లాడుతూ కల్లూరు రిజర్వ్ ఫారెస్ట్ పరిసరాలలో ఏనుగుల గుంపు తిష్ట వేసిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పాతపేట, గంటావారిపల్లి, చల్లావారిపల్లి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రజలు అటవీ ప్రాంతంలోకి వెళ్ళరాదని సూచించారు.

# సహకార బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఛైర్మన్ అమాస రాజశేఖర్

### ఇంటర్వ్యూ

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** జిల్లా సహకార బ్యాంకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఇటీవల జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఛైర్మన్ పదవీ బాధ్యతలు స్వీకరించిన అమాస రాజశేఖర్ రెడ్డి తెలిపారు. చిత్తూరు జిల్లా సహకార బ్యాంకును దక్షిణ భారత దేశంలోనే అగ్రభాగంలో నిలిపి చిత్తూరు సహకార కేంద్ర బ్యాంకు ఖ్యాతిని పెంచిన అమాస రాజశేఖర్ రెడ్డి మూడవసారి ఛైర్మన్ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు.

**ప్రజాశక్తి:** గతంలో రెండుసార్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఛైర్మన్‌గా పనిచేశారు. మూడోసారి పదవీ బాధ్యతలు చేపట్టాక బ్యాంకు అభివృద్ధికి ఎలా కృషి చేయనున్నారు..?

**డిసిసిబి ఛైర్మన్:** గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో నాకు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఛైర్మన్‌గా అవకాశం కల్పించడం జరిగింది. అనంతరం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక నారా చంద్రబాబు నాయుడు డిసిసిబి ఛైర్మన్‌గా నన్ను ఎంపిక చేశారు. తరువాత తెలుగుదేశం పార్టీ ఓడిపోవడంతో కొంతకాలం రాజకీయాలకు దూరంగానే ఉంటూ తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయడం జరిగింది. తిరిగి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాపై అపార నమ్మకంతో నాకు డిసిసిబి ఛైర్మన్ పదవీ బాధ్యతలను అప్పగించారు.

**ప్రజాశక్తి:** జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఛైర్మన్‌గా ఉన్న కాలంలో బ్యాంకు అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టారు....?

**డిసిసిబి ఛైర్మన్:** మొదటిసారి డిసిసిబి ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన నాటికి ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఖాతాదారులు 26,000 మంది మాత్రమే ఉండేవాళ్ళు. నేను బాధ్యతలు చేపట్టిన తర్వాత ఏడున్నర లక్షల ఖాతాదారుల సంఖ్యను పెంచడం జరిగింది. ఎంతోమంది అనుభవజ్ఞుల సలహాలు సూచనలతో బ్యాంకును లాభాల్లోకి తీసుకువచ్చి అనేక మంది రైతులకు బ్యాంకు నిబంధనలకు అనుగుణంగా వ్యవసాయ, ఇతర వాణిజ్య రుణాలు అందించడం జరిగింది. ప్రతి బ్యాంకుకు తమ ఖాతాదారులే బలం.

**ప్రజాశక్తి:** బ్యాంకు అభివృద్ధి కోసం ప్రజలకు ఎలాంటి సూచనలు చేస్తున్నారు..?

**డిసిసిబి ఛైర్మన్:** ముఖ్యంగా జిల్లాలోని ప్రజలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకును మన బ్యాంకుగా భావించాలి, ఈ బ్యాంకు మన కోసం స్థాపించిందనే విషయాన్ని ఎప్పుడూ గుర్తు పెట్టుకోవాలి. సమీపంలోని సహకార కేంద్ర బ్యాంకు బ్రాంచ్‌లకు వెళ్లి తమకు అవసరమైన రుణాలను పొందాలి.

**ప్రజాశక్తి:** గత పాలకవర్గంపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. వీటిని ఎలా పరిష్కరిస్తారు...?

**డిసిసిబి ఛైర్మన్:** గత పాలకవర్గంపై అనేక అవినీతి ఆరోపణలు రావడం వాస్తవమే. ఈ ఆరోపణలపై ఏడుగురు ఎమ్మెల్యేలతో రాష్ట్ర ప్రభుత్వం విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ విచారణ కమిటీలో పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి సభ్యులుగా ఉన్నారు. అవినీతి విషయాన్ని కమిటీ నిగ్గు తేలుస్తుంది.

**ప్రజాశక్తి:** జిల్లా సహకార బ్యాంకు వ్యవహారాలు ఎలా ఉంటాయి...?

**డిసిసిబి ఛైర్మన్:** ఛైర్మన్ బాధ్యత అత్యంత కీలకమైనప్పటికీ 21మంది పాలకవర్గ సభ్యులు ఉంటారు. బ్యాంకుకు సంబంధించిన ప్రతి విషయాన్ని పాలకవర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అపార నమ్మకంతో డిసిసిబి ఛైర్మన్ బాధ్యతలను మరోసారి నాకు అప్పగించడం జరిగింది. తెలుగుదేశం పాలనలో ప్రతి విషయంపై నిఘా అనేది ఉంటాది. బాధ్యతలు ఇచ్చే ముందు సమర్థతను దృష్టిలో ఉంచుకొని బాధ్యతలను అప్పగిస్తారు.

## ప్రాణం తీసిన ఈత సరదా

**ప్రజాశక్తి- బంగారుపాళ్యం**

మృతుడు మురళి, ప్రమాదానికి కారణమైన బావి

ఈత సరదా ప్రాణం తీసిన సంఘటన ఆదివారం మండలంలోని తగ్గువారిపల్లి గ్రామసమీపంలో చోటు చేసుకున్నది. సిఐ శ్రీనివాస్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా ములబాగులు తాలూకా చాపలదీన్నె గ్రామానికి చెందిన వెంకట్ రమణ కుమారుడు మురళి (23) అదే గ్రామానికి చెందిన ఐదుగురుతో కలిసి బంగారుపాల్యం మామిడి మండిలలో పనిచేసేందుకు వచ్చారు. ఆదివారం మధ్యాహ్నం ఉక్కపోతకు తగువారిపల్లి గ్రామంలోని వ్యవసాయ బావ వద్ద ఈత కొట్టేందుకు వెళ్లారు. మురళి బావిలో దూకి పైకి రాకపోవడంతో తోటి స్నేహితులు అజయ్, విశ్వనాధ్, విజయ్, రాజశేఖర్, గణేష్ బావిలో గాలించగా అతడు నీటిలోనే మృతి చెందినట్లు గుర్తించారు. అనంతరం మృతుని తండ్రి వెంకటరమణ సమాచారం తెలపడంతో వెంకటరమణా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

# తిరుమలకు పోటెత్తిన భక్తులు..

- దర్శనానికి 24 గంటల సమయం
- క్యూలలో భక్తుల నిరీక్షణ

**ప్రజాశక్తి- తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. ఆదివారం కావడంతో భక్తుల రద్దీ మరింత ఎక్కువైంది. గత కొద్ది రోజుల నుంచి తిరుమలలో భక్తుల రద్దీ ఎక్కువగానే కనిపిస్తుంది. అలిపిరి టోల్ గేట్ నుంచి ప్రారంభమైన రద్దీ చివరకు శ్రీవారి దర్శనం వరకూ కొనసాగుతుంది. ఎక్కడ చూసినా తిరుమలలో భక్తుల రద్దీతో కొండ కిటకిటలాడుతుంది. అయితే భక్తులు ఎక్కడా ఇబ్బంది పడకుండా అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు టిటిడి అధికారుల తెలిపారు. సామాన్య భక్తులకు సత్వరం దర్శనం కలిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

గతకొద్ది రోజుల నుంచి తిరుమలకు భక్తుల రద్దీ పెరుగుతుండటంతో అందుకు అవసరమైన చర్యటలను టిటిడి జాగ్రత్తలు తీసుకుంటుంది.

**మే నెలలో హుండీ ఆదాయం రూ.108 కోట్లు**

తిరుమలలో సామాన్య భక్తులకు టిటిడి పెద్దపీట వేసింది. సౌకర్యాలు పెరిగాయని భక్తులు చెబుతున్నారు. గత మే నెలలో 23.79లక్షల మంది శ్రీవారిని దర్శించుకున్నారు. హుండీ కానుకల ద్వారా రూ.108కోట్ల ఆదాయం వచ్చినట్లు టిటిడి అధికారులు తెలిపారు. మే నెలలోనే 1.62 కోట్ల లడ్డూలు భక్తులకు విక్రయించినట్లు అధికారులు వెల్లడించారు. రికార్డు స్థాయిలో 1.33 కోట్ల మంది అన్నప్రసాదాలు స్వీకరణ చేశారని అధికారులు తెలిపారు. ఈ నెల ఇంకా భక్తుల సంఖ్య పెరగడంతో మరింత ఆదాయం తిరుమలకు పెరిగే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండిపోయాయి. శిలాతోరణం వరకూ భక్తుల క్యూ లైన్ విస్తరించింది. ఉచిత దర్శనం క్యూ లైన్‌లోకి ఉదయం ఏడున్నర గంటలకు టోకెన్లు లేకుండా ప్రవేశించిన భక్తులకు శ్రీవారి దర్శనం 24 గంటల సమయం పడుతుందని అధికారులు తెలిపారు. టైమ్ స్లాట్ దర్శనం భక్తులకు శ్రీవారి దర్శనం ఐదు నుంచి ఆరు గంటల సమయం పడుతుంది. రూ.300ల ప్రత్యేక దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులకు శ్రీవారి దర్శనం మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుంది.

## నేడు షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానం

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** విద్యార్థుల్లో ప్రతిభా పాఠవాలు పెంపొందించుటకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు తలపెట్టిన షైనింగ్ స్టార్ట్ అవార్డుల కార్యక్రమం ఈనెల 9వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, ఇన్చార్జి మినిస్టర్, ఎమ్మెల్యేలు పాల్గొంటారని, జిల్లాలోని 31 మండలాల నుండి పదవ తరగతిలో అత్యధిక మార్కులు పొందిన 190 మంది విద్యార్థులకు, ఇంటర్మీడియట్‌లో 33 మంది విద్యార్థులకు అవార్డులు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఒక్కొక విద్యార్థికి ప్రశంసాపత్రం, రూ.20వేలు నగదు బహుమతి, మెడల్ అందజేయడం జరుగుతుందన్నారు. అవార్డులకు ఎంపికైన విద్యార్థులు ఐడి కార్డు, ఆధార్ కార్డు, స్టడీసర్టిఫికెట్, రెండు పాస్పోర్ట్ సైజ్‌ఫోటోలు తీసుకునిరావాలని, ప్రతి విద్యార్థితోపాటు తల్లిదండ్రులలో ఒకరు ఆధార్ కార్డుతో అనుమతించబడతారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

### షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికైన విద్యార్థిని భూమిక

**ప్రజాశక్తి- యాదమరి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నెలకొల్పిన షైనింగ్ స్టార్స్ అవార్డుకు యాదమరి మండలంలోని డి.కె.చెరువు ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.భూమిక 600 మార్కులకు గాను 576 మార్కులను సాధించి, మండల ప్రథమ స్థానం పొంది షైనింగ్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మజిద్ సాహెబ్ తెలిపారు. ఈసందర్భంగా బి.భూమికను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

### కత్తెరపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవార్డులు

**కార్వేటినగరం:** కత్తెరపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాష్ట్ర ప్రభుత్వం అందించే షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని ఆ పాఠశాల హెచ్‌ఎం చెంగల్రాజు అన్నారు. ఆధివారం షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులతో కలసి అభినందించారు. 10వతరగతి 2025 ఫలితాల్లో కత్తెరపల్లి పాఠశాల విద్యార్థులు ఎం. ప్రశాంత్ ( 576), టీ. చిన్ని( 546), ఈ. ద్వాని(518) మార్కులు సాధించి అవార్డుకు ఎంపికై తమ పాఠశాల ఉనికి చాటారని హెచ్‌ఎం తెలిపారు. ఉపాధ్యాయులు చలపతిరావు, సుజల, మోహనమురలీ పాల్గొన్నారు.

# గతుకుల రహదారులు..

- పట్టించుకోని పాలకులు అధికారులు
- వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు

**ప్రజాశక్తి -పలమనేరు రూరల్:** దశాబ్దాలు గడుస్తున్నా గ్రామీణ ప్రాంతాల రోడ్లు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. ఏళ్ల తరబడి పాలకులు పట్టించుకోకపోవడంతో వాహన చోదకులు గతుకుల రహదారులపై పడరాని పాట్లు పడుతున్నారు.

**గతుకుల రహదారులు..**

పలమనేరు -కుప్పం రహదారి నుండి నెల్లిపట్ల గ్రామానికి వెళ్లే దారి దశాబ్దాలు గడిచినా మరమ్మతుకు నోచుకోలేదు. దీంతో నడవడం, వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందికరంగా వుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిలోని కనీసం గ్రామాలలోనైనా రోడ్డు బాగు చేస్తే అనుకూలంగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. కొలమాసనపల్లి గ్రామంలో కిలోమీటరు దూరం రోడ్డు పూర్తిగా గుంతల మయమై ఎక్కడ రోడ్డు బాగుందో.. ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియని దుస్థితిలో ఉన్నామని ప్రజలు వాపోతున్నారు.

**వాహనచోదకుల తీవ్ర ఇబ్బందులు**

తేలికపాటి వర్షానికి గుంతలో నీరు నిల్వడంతో పాత చెరువులను తలపిస్తున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. గతుకులమయమైన రహదారిపై విధిలేని పరిస్థితుల్లో వెళుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఏ నిమిషానికి ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళుతున్నామని వాహన చోదకులు పేర్కొంటున్నారు.

**ఆందోళన కలిగిస్తున్న దుమ్ము**

ఈ గతులకు రహదారుల్లో భారీ వాహనాలు వెళితే రోడ్డు నుండి వచ్చే దుమ్ము రోడ్డుకు ఇరు వైపులా వున్న నివాస గృహాలు, వ్యాపారులపై వెళ్లి కమ్ముకుపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నాయకుల రాకతో నీళ్లు చల్లారు..**

గుంతలయమై ప్రమాదకరంగా మారిన కొలమాసనపల్లి- నెల్లిపట్ల రోడ్డు

శనివారం, ఆదివారం రోజుల్లో నెల్లిపట్ల గ్రామంలో గంగజాతర ఉండడంతో ఈ రహదారి మీదుగా పలువురు నాయకులు వస్తారని తెలుసుకున్న అధికారులు ట్యాంకర్లతో రహదారిపై నీరు చల్లడం విడ్డూరంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. నాయకులు వచ్చినప్పుడు మాత్రమే ఈ రహదారులు కన్పిస్తాయా? ప్రతిరోజూ దుమ్ము దూళితో ఇబ్బందులకు గురవుతున్న స్థానికులు గుర్తు రారా? ఇక్కడ ఉన్న వారు మాత్రం మనుషుల కాదా?' అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**పట్టించుకోని పాలకులు అధికారులు**

కొల మాసనపల్లి నుండి నెల్లిపట్ల వరకు దారి పూర్తిగా పాడైపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనం దాటాలంటే తప్పనిసరిగా రోడ్డు కిందికి దిగి కొంతసేపు ఆగి మళ్లీ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏ ద్విచక్ర వాహనం వచ్చినా ఇదే పరిస్థితి ఎదురవుతోంది. కనీసం రోడ్డుకిరువైపులా మట్టి పరిచ చదును చేయకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. పరిస్థితి ఇలాగే వుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. కనీసం రోడ్డుకు ఇరు వైపులా కొట్టుకుపోయిన కాలువలనైనా మట్టితో నింపితే బాగుంటుందని పేర్కొంటున్నారు.

నాయకుల రాకతో ట్యాంకర్లతో నీళ్లు చల్లి దుమ్మును అరికడుతున్న దృశ్యం

ఈ ప్రాంతం అటవీ ప్రాంతం కావడంతో రాత్రి వేళల్లో మరీ ఇబ్బందిగా ఉంటుందని కనీసం ఉన్న గుంతల నైనా పూడ్చి రహదారిని బాగు చేయాలని ప్రభుత్వ పాలకులు, అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

# క్రైం న్యూస్

## మద్యం మత్తులో ఘర్షణ

- మిద్దెపై నుండి పడ్డ యువకులు
- ఒకరు మృతి, మరొకరికి గాయాలు

మిద్దెపై నుండి కిందపడి గాయపడిన యువకులు

**ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి :** మద్యం మత్తులో మిద్దెపై నుండి యువకులు కిందపడడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు..నెల్లిపట్ల గ్రామంలో ఆదివారం గంగమ్మ జాతర సందర్భంగా శనివారం రాత్రి గ్రామానికి చేరుకున్న నంద కుమార్(25) తమిళనాడుకు చెందిన శర్వణ (29) గ్రామంలో గంగమ్మ జాతర సందర్భంగా అమితంగా మద్యం తాగారు. ఘర్షణ పడటంతో ఇద్దరూ మిద్దె పైనుండి కింద పడ్డారు. ఈ సంఘటనలో నందకుమార్ బలమైన గాయాలు తగిలి రక్తం అధికంగా పోయిందని, స్థానికులు 108 ద్వారా బైరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రి కి చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. శర్వణ చికిత్స తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ పరశురాముడు సంఘటన స్థలానికి చేరుకొని నందకుమార్ కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నేడు కంటి వైద్య శిబిరం

**ప్రజాశక్తి -బంగారుపాలెం:** ఉచిత కంటి వైద్యశిబిరం సోమవారం నిర్వహించనున్నట్లు శంకర్ నేత్రాలయ మిషన్ ఫర్ విజన్ సిబ్బంది మురళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతినెల రెండవ సోమవారం మండల అభివృద్ధి కార్యాలయం ఆవరణలో చెన్నైకి చెందిన మిషన్ ఫర్ విజన్ ,శంకర్ నేత్రాలయ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని సమస్యలు ఉన్నవారు కంటి వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేసుకుని సమస్యలున్న వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు కంటి అద్దాలు ఇస్తారని తెలిపారు.

దుర్యోధనుడి వధ ఘట్టాన్ని తిలకిస్తున్న భక్తులు

## అలరించిన దుర్యోధన వధ

**ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు:** గంగాధరనెల్లూరు నెల్లేపల్లి గ్రామంలో ద్రౌపది సమేత ధర్మాజులు మహాభారత వార్షికోత్సవం భాగంగా 17వ రోజు నిర్వహించిన దుర్యోధన వధ ఘట్టం పలురిని ఆకట్టుకుంది. అశోక్ భీముని పాత్రధరించగా, కిరణ్ దుర్యోధన పాత్రధారి ధరించి తలపడ్డారు. ఆఖరికి దుర్యోధన వధ ఘట్టాని పూర్తి చేశారు. ఆలయం వద్ద ఆదివారం రాత్రి అగ్నిగుండం నిర్వహించారు. పెద్దమిట్టపల్లికి చెందిన దామోదర్ రెడ్డి కుటుంబ సభ్యులు ఆలయం వద్ద మధ్యాహ్నం పలువురికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మహాభారతం నిర్వాహకులు ప్రసాద్ రెడ్డి, రవీంద్రారెడ్డి, వెంకట రెడ్డి, గంగయ్య, యుగంధర్ రెడ్డి, దేవరాజుల నాయుడు, శ్రీధర్ యాదవ్, పుష్పరాజ్ , సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా బండి కుంభాలు

**ప్రజాశక్తి -వెదురుకుప్పం:** మండలంలోని పచ్చికాపల్లంలో నిర్వహించిన్తున్న మహాభారత మహోత్సవంలో భాగంగా ఆదివారం సాయంత్రం బండి కుంభాలు నిర్వహించారు. వివిధ వాయిద్యాలతో సాగిన ఈ కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పోటు జేను గ్రామస్తులు పాల్గొన్నారు.

## వెయ్యి మందికి అన్నదానం

**ప్రజాశక్తి- కార్వేటినగరం :**

మండల పరిధిలోని డిఎం పురం పంచాయతీ దేరా కండ్రిగ గ్రామం నేనేరమ్మ ఆలయంలో 14వ వార్షికోత్సవం ఘనంగా ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం దేరా కండిగా, పాత దేరా కండిగా, నాయుడు ఇండ్లు గ్రామస్తులు మంచిగ వచ్చి ఆలయం వద్ద పొంగల్ లో పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గ్రామస్తులు అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమం ఆముదాల సుగుణ (తిరుపతి ) చల్ల చిన్నబ్బ, గుత్తి బొబ్బిలి (బెంగళూరు ) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆనందమండిడి, ప్రకాష్, వెంకటేష్, గోపాల్, బొబ్బిలి, మునిసుందరం పిళ్ళే, చల్ల మండిడి, బీమయ్య, మురళి, గోపి, వివిధ గ్రామస్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకరం చేస్తున్న రైతులు

## మామిడికి మద్దతు ధరపై రైతుల హర్షం

**ప్రజాశక్తి- రొంపిచర్ల:**

పుంగనూరు నియోజకవర్గంలోని పులిచెర్ల మండలం కొత్తపేటలో రైతులు సీఎం చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఇటీవల తోతాపురి మామిడికి మద్దతు ధరను రూ.12,000గా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో తమ కష్టానికి ధర లభించినందుకు రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ ఈ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పులిచెర్ల మండల టిడిపి గోపి నాయుడు, ఎంపీటీసీ ముని కృష్ణమ నాయుడు(కిట్టు), శంకర్, దేవా పలువురు రైతులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గతంలో మద్దతు ధరలపై అసంతృప్తి వ్యక్తం చేసేందుకు నిరసనలు చేపట్టిన తాము, ఈసారి చరిత్రలో తొలిసారిగా ప్రభుత్వ నిర్ణయంపై సంతోషం వ్యక్తం చేస్తున్నామని పేర్కొన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలతో పాటు, కొనుగోలు కేంద్రాలు సమయానికి ఏర్పాటు చేయాలని కోరారు.

## నేత్ర పర్వంగా ద్రౌపదీ కల్యాణం

**ప్రజాశక్తి -కార్వేటినగరం:** మండల పరిధిలోని కొల్లాగుంట గ్రామంలో మహా భారత వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీద్రౌపదీ, ధర్మరాజుల స్వామి కల్యాణాన్ని వేద పండితులు వేద మంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై ప్రతిష్టించి గ్రామ వీధుల్లో మేళతాళాల నడుమ అత్యంత వైభవంగా ఊరేగించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కళ్యాణ వేదికకు అమ్మవారిని తీసుకొచ్చి ధర్మరాజుల స్వామి వారితో కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న దంపతులకు ఆలయ ఆధ్వర్యంలో స్వామి ప్రసాదంతో పాటు వారి సారెను అందించి ఘనంగా సన్మానించారు.

# ఉపాధి చింత!

- కష్టం కొండంత..ఆదాయం గోరంత..
- చింత చిగురు విక్రయదారులకు చాలీచాలని ఆదాయం
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

**ప్రజాశక్తి - వెదురుకుప్పం:** ఈ సీజన్లో చింత చిగురు మార్కెట్లో దొరుకుతుంది.. అయితే ఆ చింత చిగురును విక్రయించే గ్రామీణుల కష్టం వర్ణనాతీతం..కుటుంబం అంతా నాలుగు, అయిదు గంటలు పనిచేసి చింత చిగురు కోసి మార్కెట్లో విక్రయించినా కనీస గిట్టుబాటు కూలీ కూడా లభించడం లేదని చింత చిగురు విక్రయదారులు వాపోతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

**కష్టం కొండంత..ఆదాయం గోరంత..**

వెదురుకుప్పం మండలంలో 25 గ్రామ పంచాయతీలు వున్నాయి. వీటి పరిధిలో అన్ని గ్రామాల నుండి వంద మంది వరకు మహిళలు తమ కుటుంబ సభ్యులతో కలిసి గ్రామ ప్రాంతాల్లోని చింత చెట్ల నుండి చిగురును కోసి ఇటు తిరుపతి, అటు చిత్తూరు రైతు బజార్లకు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు. సుమారు కుటుంబం అంతా నాలుగు, అయిదు గంటలు కష్టపడితే ఓ కేజీ ఆకు మాత్రం కోయవచ్చని తెలిపారు. కేజీ ఆకు 300 నుండి 400 రూపాయల వరకు, చిన్న కుప్ప ఒకటి ధర 20 రూపాయలు వరకు అమ్ముతున్నామని, వాటిని తీసుకెళ్లడానికి అయ్యే చార్జీలు, భోజనం ఖర్చులు అన్నీ పోను కనీసం గిట్టుబాటు కూలీ రూ.400 కూడా రావడం లేదని గ్రామీణ మహిళలు వాపోతున్నారు. రోజుకు ఆరు గంటలు ఇంట్లో భార్యా భర్త, పిల్లలు కలిసి పనిచేస్తున్నా చాలీచాలని ఆదాయం వస్తోందని కష్టం కొండంత, ఆదాయం గోరంత అన్న చందంగా తమ బతుకులు వున్నాయని చింత చిగురు విక్రయదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**చాలీచాలని ఆదాయం**

ఈ సీజన్లో మాత్రమే ఈ చింత చిగురుకోసి విక్రయించే పని వుంటుందని మిగిలిన సమయాల్లో పని దొరక్క జీవనం కష్టంగా మారుతోందని, వచ్చే చాలీచాలని ఆదాయంతో తమ బతుకులు సాగడం కష్టతరంగా మారుతున్నాయని చింత చిగురు విక్రయ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వం ఆదుకోవాలని వినతి**

ఆర్థికంగా వెనుకబడిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని చింత చిగురు విక్రయ మహిళలు కోరుతున్నారు. తమకు ప్రభుత్వం తమకు ఉపాధి కల్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తున్నారు.

**సరైన ఉపాధి దొరకడం లేదు**

ఇంటిల్లిపాది ఆరు గంట లు కష్టపడి పని చేసినా 300 వందల నుండి 400 వందల రూపాయలు మాత్ర మే వస్తున్నాయి. చింత చిగురును కోసి అమ్ముకు నేందుకు మా ప్రాంతానికి సమీపంలో తగిన ఏర్పాటు కల్పించాలి.. ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నా య ఏర్పాట్లు చేయాలి..

- సుజాత, డిటి కండ్రిగ.

కృష్ణమూర్తికి శుభాకాంక్షలు తెలుపుతున్న వైసిపి నాయకులు

## వైసిపి రాష్ట్ర కార్యదర్శికి జన్మదిన శుభాకాంక్షలు

**ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:**

మండల కేంద్రానికి చెందిన వైసిపి రాష్ట్ర కార్యదర్శి మొగసాల కృష్ణమూర్తికి ఆదివారం పుట్టినరోజు కావడంతో మండలానికి చెందిన వైస్ ఎంపీపీలు నారాయణస్వామి, రూపా, జైకుమార్, వైసిపి సర్పంచ్లు, ఎంపిటిసిలు కలిసి కృష్ణమూర్తి స్వగృహంలో ఆయనకు కండువా కప్పి , పూల మాలవేసి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విందులో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న నాయకులు

## వేరుశనగ విత్తనాలు పంపిణీ

**ప్రజాశక్తి-రొంపిచర్ల:**

పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీ వెంకట దాసరిపల్లి రైతు భరోసా కేంద్రంలో ఆదివారం రైతులకు సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు పులిచెర్ల మండల వ్యవసాయ అధికారి హరి ప్రసాద్ పంపిణీ చేశారు. రైతుకు పాసుపుస్తకాలపై ఇచ్చే రాయితీ విత్తనాలను పారదర్శకంగా పంపిణీ చేయాలని సిబ్బందికి ఆదేశించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## భక్తులకు అన్నదానం

**ప్రజాశక్తి-సోమల:**

సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలో వెలసిన పాలేటి అమ్మవారి తిరుణాల మహోత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం 6 గంటలకు పొంగుపాలు, ఎనిమిది గంటలకు అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నతదానం చేశారు. మధ్యాహ్నం సిద్ధ పూజ నిర్వహించి అనంతరం బాణాసంచా పేలుళ్లతో అమ్మవారి చాందిని బండ్లను ఊరేగించారు. రాత్రి 9 గంటల నుండి పాండురంగ కళా నాట్య మండలి వారిచే వారణా వ్రతం నాటకాన్ని ప్రదర్శించగా భక్తులు తిలకించారు. సోమవారం ఉదయం 12 గంటలకు అమ్మవారికి బోనాలు సాయంత్రం నాలుగు గంటలకు కల్లిపాటు, రాత్రి 8 గంటల నుండి అమ్మవారి పుష్ప పల్లకి ఊరేగింపు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

# స్వల్పంగా పెరిగిన టమాటా ధరలు

## లాభాలపై చిగురిస్తున్న రైతుల ఆశలు

**ప్రజాశక్తి-సోమల:** అప్పులు చేసి లక్షల కుమ్మరించి టమాటా సాగు చేసిన రైతన్నకు గత మూడు నెలలుగా ధరలు లేక పెట్టిన పెట్టుబడి రాక తీవ్ర నష్టాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. ఇటీవల 15 రోజులుగా 15 కేజీల టమాటా బాక్స్ 40,50 నుండి 100 రూపాయలు వరకు ధర పలికింది. అయితే ఈ ధరలతో పెట్టుబడి కూడా రాక చేతి నుండి ఖర్చు అవుతుందని ఆందోళన చెందిన రైతన్నకు ఆదివారం పుంగనూరు టమోటా మార్కెట్లో 15 కేజీల బాక్స్ 240 రూపాయల ధర పలకడంతో ఇదే ధర కొనసాగినా, ఇంకా పెరిగినా తాము చేసిన అప్పుల నుండి కష్టపడిన కష్టం నుండి గట్టెక్కుతామని రైతులు ఆశిస్తున్నారు.

## షాపులు శుభ్రం.. దారులు ఛిద్రం

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :**

పట్టణంలోని ప్రముఖ వస్త్ర దుకాణదారులు నిత్యం తమ దుకాణాలను కడిగి, ఆ నీటిని రోడ్డుపై వదులుతుండటంతో, రోడ్డుపై వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. కొందరు ఆ నీటి వల్ల ఏర్పడిన బురదలో జారి పడుతున్నారు. పుత్తూరు -తిరుపతి రోడ్డు మెయిన్ స్కూల్ ఎదురుగా ఉన్న రెండు వస్త్ర దుకాణదారులు ఒకరిపై ఒకరు పోటీ పడి తమ దుకాణాలను ప్రతిరోజు ఉదయం నీటితో శుభ్రం చేసి, ఆ నీటిని రోడ్డుపైకి వదిలేస్తున్నారు. ఈ షాపులే కాక పుత్తూరులో చాలా షాపుల యాజయాన్యాలు ఇలాగే షాపులు శుభ్రం చేసిన నీటిని రోడ్డుపై వదులుతున్నారు. మున్సిపాలిటీ అధికారులు తగు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## ట్రాఫిక్ పోలీసులకు టోపీలు పంపిణీ

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ :** వేసవిని దృష్టిలో ఉంచుకొని టిడిపి నాయకులు తిరుపతి ట్రాఫిక్ పోలీసులకుయ టోపీలు పంపిణీ చేశారు. టీడీపీ నాయకురాలు, చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి పి.హేమలత తిరుపతి ట్రాఫిక్ స్టేషన్ను సందర్శించారు. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణ అచారి, ట్రాఫిక్ సీఐ సమక్షంలో ఆమె ట్రాఫిక్ పోలీసులకు టోపీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో తీవ్ర ఎండల మధ్య రోడ్లపై విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బందికి కొంత ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ఈ సహాయ కార్యక్రమాన్ని చేశామని తెలిపారు. క్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో రాష్ట్ర స్థాయిలో లాస్య

**ప్రజాశక్తి-కోట :** గుంటూరు జిల్లా, తెనాలి, ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం రాష్ట్రస్థాయి కరాటే పోటీలను విక్టోరియా షార్ట్కట్ కరాటే అసోసియేషన్ డూ ఇండియా వారు నిర్వహిం చారు. ఇంటర్ స్టేట్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్షిప్ 2025 కార్యక్రమంలో భాగంగా కోట మండలం, చెందోడు శ్రీ విద్యా వికాస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థిని ముప్పవరపు వెంకట లాస్య కట ఈవెంట్లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. నిర్వాహకులు మంగళగిరి ఎస్.పి బల్లి రవిచంద్ర చేతుల మీదగా ప్రశంసాపత్రం, మెడల్ అందుకుంది.

## నడకతో సంపూర్ణ ఆరోగ్యం

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** నడకతో సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని ప్రముఖ న్యాయవాది సంజీవి తెలిపారు. ఆదివారం వాకర్స్ అసోసియేషన్ భవనంలో వాకర్స్ అధ్యక్షులు కేఎల్ఎం మూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాకర్స్ నడిచే సమయంలో రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. అనంతరం డాక్టర్ రవి రాజు మాట్లాడుతూ నడకతో బీపీ షుగర్ ఉండే జబ్బులు వంటి వ్యాధులు నివారించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ డిస్ట్రిక్ గవర్నర్ రావుల మాధవ నాయుడు, కార్యదర్శి మునికృష్ణయ్య, కార్యనిర్వహణ కార్యదర్శి రఫీ అహ్మద్, గోపికృష్ణ, మురుగే రెడ్డి, చిన్న పాల్గొన్నారు.

కుంభాభిషేక మహోత్సంలో పాల్గొన్న చల్లాబాబు

## కుంభాభిషేక వేడుకల్లో చల్లా బాబు

**ప్రజాశక్తి -రొంపిచర్ల:** పులిచెర్ల మండలం దిగువ పోకలవారి పల్లి పంచాయతీ ఎల్లంపల్లి లో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామస్వామి గుడి ప్రారంభోత్సవానికి పుంగనూరు టిడిపి ఇన్ఛార్జి చల్లా రామచంద్ర రెడ్డి పాల్గొన్నారు. ఆయనకు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి సత్కరించారు. గ్రామస్తులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం చల్లాబాబు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎల్లంపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

## గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే

**ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి:** మండలంలోని నెల్లిపట్ల గ్రామంలో ఆదివారం గంగ జాతర పండుగ ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమానికి పలమనేరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఎన్ అమరనాథ రెడ్డి గంగమ్మ జాతరకు హాజరు కాగా గ్రామంలోని రమేష్ రెడ్డి తదితరులు ఆయనకు పూలమాలవేసి దుశ్శాలువతో సత్కరించారు. ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి గంగమ్మకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు పాడిపంటలు, సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకున్నానని తెలిపారు.

**పెద్దపంజాణి:** మండలంలోని బసవరాజుకండ్రిక గ్రామంలో శని, ఆదివారం గంగమ్మ జాతరను గ్రామస్తులు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు స్థానిక ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి హాజరయ్యారు. స్థానిక మండల టిడిపి నాయకులతో కలిసి ఆయన అమ్మవారి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురిసి రైతులు పంటల పండించి వారికి మంచి దిగుబడి కావాలని కోరుకున్నటుల తెలిపారు. ఈ కార్యక్రమాలలో మండల నాయకులు మురహరి రెడ్డి, చలపతి, భాను ప్రతాప్ రెడ్డి, రామకృష్ణ, సోమశేఖర్ పాల్గొన్నారు.

## ఎమ్ఎఫ్ కమిటీలో నగరి నియోజక వర్గానికి ప్రాధాన్యత

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** తిరుపతి జిల్లాలో ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ సృష్టి కర్త, ప్రధాన కార్యదర్శి డిల్లిబాబు రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి జిల్లా నూతన కమిటి ని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో నగరి నియోజకవర్గం నుండి పుత్తూరుకి చెందిన సీనియర్ జర్నలిస్ట్ సి.వి.ప్రసాద్ వర్మ వైస్ ప్రెసిడెంట్ గాఎన్నికయ్యారు. ఈసి మెంబర్లుగా పుత్తూరు చెందిన టి లోకేష్, నగరి చెందిన కె.బాలాజీ (సిటీ కేబుల్)లు ఎన్నుకున్నారని ఏ పి ఎమ్ ఎఫ్ వ్యవస్థాపకులు, ప్రధాన కార్యదర్శి ఢిల్లీ బాబు రెడ్డి తెలిపారు.

# గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తే 'పినాక' లక్ష్యం

- ఐఆర్ఎస్ అడిషనల్ ఇన్కమ్ టాక్స్ కమిషనర్ యాదగిరి

**ప్రజాశక్తి -గంగవరం:** గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల భవిష్యత్తే తమ లక్ష్యం అని హైదరాబాదు ఐఆర్ఎస్ ఇన్కమ్ టాక్స్ అడిషనల్ కమిషనర్, పినాక ప్రజా సాధికార ట్రస్ట్ వ్యవస్థాపకులు బి యాదగిరి పేర్కొన్నారు. మండలంలోని ఎజెసి కల్యాణ మండపంలో పినాక సాధికార ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహాలు అందించారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతికి చెందిన బి గాయత్రీ మేనేజింగ్ ట్రస్ట్ అఫ్ పినాక పీపుల్స్ ఎంపవర్మెంట్ ట్రస్ట్ , ఫార్మర్ అడిషనల్ హైకోర్టు కేజీ కృష్ణమూర్తి, ధర్మ తేజ మేనేజింగ్ డైరెక్టర్ బెంగళూరు, రెడ్డప్ప టీవీ 45 హైదరాబాద్, రమణ డైరెక్టర్ ప్రగతి ఎన్జీవో తిరుపతి, లైన్ రాజారామ్ కొల్లే సీఈఓ ట్రైనర్ పర్సనాలిటీ డెవలప్మెంట్, సుబ్రహ్మణ్యం గౌడు కౌన్సిలర్, సోమశేఖర్ గౌడ్ టిడిపి గంగవరం అధ్యక్షులు, జయప్ప రామకుప్పం మాజీ జెడ్పిటిసి, రమణ డైరెక్టర్ ఆఫ్ అమెరికన్ ఎక్స్ప్రెస్ యూఎస్ఏ, పిఓఆర్డి ఆర్గనైజేషన్కు చెందిన లలితమ్మ మాట్లాడుతూ.. ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ కెరియర్ కౌన్సెలింగ్, జీవన నైపుణ్యాల పర్సనాలిటీ డెవలప్మెంట్ కోర్సులు ఉచితంగా మే 18వ తేదీ నుండి 21వ తేదీ వరకు ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థినివిద్యార్థులు డిగ్రీ పూర్తి అయిన వారు ఇంగ్లీష్ మాట్లాడడానికి ఈ పినాక ప్రజా సాధికార ట్రస్టు శిక్షణ ఇస్తుందన్నారు. పినాక ప్రజా సాధికార ట్రస్ట్ 2012 సంవత్సరం నుండి ఇప్పటి వరకు మదనపల్లె, రాయచోటి, నగరి, పలమనేరు ప్రాంతాల విద్యార్థిని విద్యార్థులకు , వారి భవిష్యత్తుకు, వారి అభివృద్ధికి తమ పినాక ప్రజా సాధికార ట్రస్ట్ ఎంతగానో కృషి చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థిని విద్యార్థులకు బాగా చదువుకున్న వారికి సర్టిఫికెట్లతో పాటు ప్రోత్సాహకంగా నగదు బహుమతి అందించారు. బి స్వాతికి రూ ఐదువేలు, ఎస్ సబిహకు రూ.2,500 ప్రోత్సాహక బహుమతి అందించారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్తో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గజేంద్ర, జయశ్రీ, ముద్దుకృష్ణ, చలపతి, రూప్ కుమార్, మల్లికార్జున పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రముఖులు

ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు బహూకరిస్తున్న పినాక సంస్థ ప్రతినిధులు